క్లుప్తంగా

అనంతవరంలో లింకు రోడ్డు పనులు ప్రారంభం



అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో లింకురోడ్డు పనులు ఎంపీపీ కోటయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరుశంకరరావు సహకారంతో గ్రామంలోని చర్చి వద్ద నుంచి రేగడిపొలాల(సుమారు 2కిమీ)కు వెళ్లే రోడ్డు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రైతుల అవసరాలకు లింకురోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్టీ కాలనీలో లక్ష రూపాయలతో బోరు పంపు వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వేణుగోపాలరెడ్డి, సురేంద్రరెడ్డి, మాధవరెడ్డి, వెంకట్రావు, వీరాంజనేయులు, గురుస్వామి పాల్గొన్నారు.

వేగవంతంగా రక్షిత నీటి పనులు



నకరికల్లు: మండలంలో రక్షిత మంచినీటి సరఫరా పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రత్నబాబు ఆదివారం తెలిపారు. నకరికల్లు ఎస్ఎస్ ట్యాంకు నుంచి అడ్డరోడ్డుకు రూ.30.25 లక్షలతో, జిల్లాపేటతండాలోని బోరు ద్వారా తండా మొత్తం తాగునీరందించేందుకు రూ.55 లక్షలతో పైపులైను ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరితగతిన పైపులైను నిర్మాణపనులు పూర్తిచేసి నిర్ణీత సమయానికి తాగునీటిని సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా సాగర్ మెయిన్ కెనాల్ ఒడ్డున అటవీప్రాంతంలో ఉన్న జిల్లాపేట తండాకు రక్షితమంచినీటిని అందజేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. దీంతో తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు బాలనాగు మృతి



సత్తెనపల్లి: సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు, పురుగు మందుల వ్యాపారి బాలనాగు శివకోటేశ్వరరావు (55) శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని సజీవని టవర్స్‌లో నివసిస్తున్న ఆయనకు ఇటీవల కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ జరిగింది. దీనికి తోడు టీబీ సోకడంతో శనివారం పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకుకు భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలియడంతో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శివకోటేశ్వరరావు మృతదేహానికి ఆదివారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సాంబశివరావు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, 7వ వార్డు ఇన్‌చార్జ్ రవికుమార్, ప్రజా ప్రతినిధులు ఉన్నారు. అలాగే ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు, సీనియర్ న్యాయవాది వెంకటసుబ్బారెడ్డి, నాయకులు గార్లపాటి ప్రభాకర్ తదితరులు శివకోటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కటకం శ్రీను, ట్రిపుల్ ఎక్స్ శ్రీనివాసరావు, బాషా, మౌలాలి ఉన్నారు.

ఒత్తిడికి గురికాకుండా విద్యనభ్యసించాలి



సత్తెనపల్లి: విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా విద్యను అభ్యసించాలని ప్రకాశం జిల్లా మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ అత్తోట కిరణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన ఉపాధ్యాయులు బంకా వాసు బాబు, నాగమణి దంపతుల కుమారుడు నిఖిల్ చక్రవర్తి ఈ నెల 18న బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిఖిల్ చక్రవర్తి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న తరుణంలో ఒత్తిడికి గురై మృతి చెందాడన్నారు. అతని మృతి బాధాకరమన్నారు. మృతుడి తల్లిదండ్రులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కిరణ్‌కుమార్, పలు మండలాల మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, హాజరై నిఖిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాగేంద్రహారాయ.. త్రిలోచనాయ..

సత్తెనపల్లి: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పట్టణం, మండలంలోని శైవక్షేత్రాల్లో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అచ్చంపేట రోడ్‌లో గల దుర్గాఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, త్రిశక్తి దుర్గాపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిపూడిలోని సోమేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య, గ్రూప్–1 దేవాలయాల ఈవో రంగిశెట్టి సూర్యనారాయణ హాజరయ్యారు. అనంతరం అన్నసంతర్పణ చేపట్టారు. అలాగే పెద్దమక్కెనలో గంగాభ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయంతో పాటు పలు గ్రామాల్లోని శైవ క్షేత్రాల్లో కార్తీక పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్తీక దీపాలను వెలిగించారు.

అమరారామంలో భక్తుల సందడి

అమరావతి: ప్రఖ్యాత శైవ క్షేత్రమైన అమరావతిలో ఆదివారం తెల్లవారు జాము నుంచి పంచారామ క్షేత్ర సందర్శకులతో అమరేశ్వరాలయంలో సందడి నెలకొంది. భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయంలో దీపారాధనలతో శివకేశవులకు పూజలు చేశారు. భక్తులు అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీదేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదివారం సెలవు కావటంతో పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, పంచారామ క్షేత్ర సందర్శన భక్తులు వేలాదిగా అమరావతికి తరలిరావటంతో ధ్యానబుద్ధప్రాజెక్టు, పాత, కొత్త మ్యూజియంలు, అమరేశ్వరాలయం, స్నానఘాట్‌లు యాత్రికులతో కళకళలాడాయి. పంచారామ క్షేత్రాలలో ప్రథమ క్షేత్రమైన అమరావతి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది .

భక్తులకు అన్నదాన కార్యక్రమం..

కార్తీక మాసం సందర్భంగా బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో కొల్లిపర లక్ష్మీనరసింహారావు దంపతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పెదకూరపాడు నియోజవర్గ వైఎస్సార్ సీపీ నాయకురాలు నంబూరు వసంతకుమారి ప్రారంభించారు.

ముప్పాళ్ళ: మండలంలోని పలు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, దమ్మాలపాడు గ్రామంలోని శంభులింగేశ్వర స్వామి, నార్నెపాడు గ్రామంలోని భీమేశ్వరస్వామి, మాదలలోని సాగరేశ్వరస్వామి, కుందురువారిపాలెంలోని సాందీపని ఆశ్రమంలోను, లంకెలకూరపాడులోని గంగాపార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి, చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు.

నర్సింగపాడులో ...

నకరికల్లు: కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని నర్సింగపాడులో గల మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారిని, స్వామివారిని విశేషంగా అలంకరించారు. పలుగ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. మహిళలు సామూహిక దీపార్చనలలో పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో ..


దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కోటిదీపోత్సవం, జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం పురస్కరించుకొని వేలాదిగా తరలివచ్చిన మహిళలు ఆదివారం రాత్రి కోటిదీపోత్సవంలో పాల్గొన్నారు.ఆలయప్రాంగణంలో జ్వాలాతోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి జ్వాలాతోరణంలో పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలకేంద్రంలోని మందిరంలోని శివాలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా దీపార్చనలు చేసేందుకు భక్తులు పోటెత్తారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళాభక్తులు దీపారాధనలు చేశారు.

క్రోసూరు: కార్తీక పూర్ణిమ పురస్కరించుకుని ఆదివారం క్రోసూరులోని వీరభద్రమల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు, భక్తులు పాల్గొని దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

అచ్చంపేట: మండలంలోని పలు శివాలయాలలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువ జామునే భక్తులు ఆలయాలలో కార్తీక దీపాలు వెలిగించారు. హరిహర క్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవాలయంలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో చామర్రులోని కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వయంభూ ఆలయంలోని నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఆలయంలోని జ్యోతిర్లింగాలకు, నందీశ్వరస్వామివార్లకు అర్చనలు చేశారు. కోనూరు, మాదిపాడు, కస్తల, వేల్పూరు, గ్రంధశిరి, పెదపాలెం గ్రామాలలోని శివాలయాలలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



పట్టణంలోని త్రిశక్తి దుర్గా పీఠంలో కాంతులీనుతున్న కార్తీకదీపాలు



దుర్గాఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో రంగుల ముగ్గుతో అలంకరణ



నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో కోటి దీపోత్సవం



విశేష అలంకారంలో అమరేశ్వరుడు



విశేష అలంకరణలో నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళేశ్వరస్వామి



గుడిపూడిలోని సోమేశ్వరస్వామి దేవాలయంలో పూజల్లో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి



మందిరంలోని శివాలయంలో దీపార్చనలు చేస్తున్న మహిళలు



చామర్రులోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న పూజారులు.



నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో జ్వాలాతోరణం



కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజల్లో మహిళలు

వైభవంగా క్రీస్తురాజు మహోత్సవం

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం క్రీస్తురాజు దేవాలయంలో క్రీస్తురాజు మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ అంతోనిరాజు, ఫాదర్ జోసఫ్‌రెడ్డి, ఫాదర్ శౌరయ్య బైబిల్ పఠనచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజులకు రాజుగా క్రీస్తురాజును కీర్తించారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు సందేశాన్ని గ్రామస్తులకు వివరించారు. తేరులో క్రీస్తురాజును గ్రామవీధులలో ఊరేగించి, దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి చర్చి వరకు రోడ్డు వేయించి, చర్చి ముఖద్వార నిర్మాణాలకు ఆర్థిక సహాయం చేశారు. జెడ్పీటీసీ సభ్యులు విజయప్రతాప్‌రెడ్డి, చర్చి పెద్దలు మారం బాలిరెడ్డి, యేరువ రఫేల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.

పెదకూరపాడు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ నెల ఆహ్వాన ప్రార్థనలను మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదకూరపాడులోని ఏఈఎల్‌సీ చర్చిలో ప్రార్థనలు నిర్వహించి మినీక్రిస్మస్ వేడుకలు జరిపారు. పాస్టర్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘ పెద్దలు దయబాబు, కన్నయ్య, రవి, రాంబాబులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ నవంబర్ 25 నుంచి డిసెంబర్ 25 వరకు ప్రత్యేక క్రిస్మస్ ఆరాధనలను ప్రతి రోజు నిర్వహిస్తామన్నారు.



క్రీస్తురాజు దేవాలయంలో ఏసుక్రీస్తు సందేశాన్ని తెలియచేస్తున్న చర్చి ఫాదర్స్

అంబేడ్కర్ జీవితమే ఒక పాఠం



పట్టణంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి అంబటి రాంబాబు



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: పార్టీలు, పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా రాజ్యాంగ వ్యవస్థలు దెబ్బతినకుండా సవ్యంగా నడుస్తున్నాయంటే అది రాజ్యాంగ రచనా విశిష్టత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పుణ్యమేనని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఆదివారం 74వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలక జైపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా తాలూకా సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దళిత సామాజిక వర్గంలో జన్మించి, ఎన్నో కష్టాలను అనుభవించి, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి నిండేలా విద్యను అభ్యసించి రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ జీవితమే ఒక పాఠం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం 150 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మిస్తుందని, అక్కడే లైబ్రరీ కూడా ఏర్పాటు చేయబోతుండటం భావితరాలకు విజ్ఞాన భాండాగారంగా నిలుస్తుందన్నారు. సభలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్, అంబేడ్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు దావులూరి కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞానరాజ్‌పాల్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నాయకులు ప్రసాద్‌బాబు, నరసింహారావు, దళిత ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలి....

ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు సమర్థంగా అమలు చేయాలని జై భీమ్ రావు భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జె.విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా పట్టణంలోని 8వ వార్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ రావు, కోటేశ్వరరావు, ఆంథోని, సుందరరావు, అమర్నాథ్, వెంకట్రావ్, కమల్‌కుమార్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

ప్రభుత్వ కార్యాలయాల్లో ....

పట్టణంలోని మున్సిపల్, తహసీల్దార్, మండల ప్రజాపరిషత్, మండల విద్యాశాఖాధికారితో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదివారం భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, తహసీల్దార్ ఎస్.సురేష్, డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, మండల విద్యాశాఖాధికారి–1 ఏ శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, వీఆర్వోలు, మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది, సీఆర్‌పీలు ఉన్నారు.

ముప్పాళ్ళ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం బాలస్వామి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంకొండ: పటిష్ట రాజ్యాంగం ద్వారానే ప్రజాస్వామ్యానికి రక్షణ లభిస్తుందని, దేశంలోని ప్రతి ఒక్కరూ దాన్ని గౌరవించాలని ఎంఈఓ–2 బాల సుందరరావు అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కార్యాలయంలో ఆదివారం74వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి: దేశ ప్రజలందరికీ న్యాయం,స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించబడిన భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులతో ప్రజలందరూ కులమతాలు వీడి కలిసిమెలిసి జీవించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంపీడీవో పి.ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ 1949, నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదించబడిందన్నారు. వికసిత్ భారత్–2024 క్యాలెండర్ ఆవిష్కరించి, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, గ్రామ సర్పంచ్ పి.రాజేశ్వరి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగర్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబయ్య, పలువురు జిల్లాఅధికారులు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం

క్రోసూరు: ఏపీ చర్మకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు , వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి గార్లపాటి దాసు మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక్కరికి సమానహక్కులు ఉండాలన్న లక్ష్యంగా రాజ్యాంగం రాయటం జరిగిందన్నారు. పెదకూరపాడ కన్వీనర్ చిల్కా భాస్కరరావు, క్రోసూరు మండల అధ్యక్షుడు చిలకా దాసయ్య, ఉపాధ్యక్షుడు కిన్నెర వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ చిల్కా రవికుమార్, చావల శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

ప్రైవేట్ వైద్యశాల ఎదుట మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన



పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాల ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

సత్తెనపల్లి: వైద్యుల నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం బలైంది అంటూ పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాల ఎదుట మృతుని కుటుంబ సభ్యులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం వన్నాయపాలెం గ్రామానికి చెందిన పత్తిపాటి ప్రసాదరావు(45)కు గుండె నొప్పి రావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు సత్తెనపల్లిలోని అనన్య ప్రైవేటు వైద్యశాలకు మధ్యాహ్నం 1.30 గంటలకు తీసుకువచ్చారు. వైద్యశాల ప్రధాన వైద్యుడు చల్లా నాగరాజారెడ్డి అందుబాటులో లేకపోవడంతో అనస్తీషియన్ బాణావత్ సైదా నాయక్ ఇంజక్షన్ ఇచ్చాడు. 3.30 గంటల సమయంలో ప్రసాదరావు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. గుండె నొప్పి రావడంతో వెంటనే వైద్యశాలకు తీసుకువచ్చామని, నడుచుకుంటూ వచ్చిన ఆయనకు చికిత్స చేయకుండా నిర్లక్ష్యం చేశారంటూ భార్య, కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వన్నాయపాలెం, అబ్బూరు గ్రామానికి చెందిన బంధువులు పెద్ద ఎత్తున వైద్యశాలకు చేరుకున్నారు. వైద్యశాల ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. అంతేకాక అనస్తీషియ వైద్యుడిపై దాడి చేశారు. వైద్యశాలలోని ఈసీజీ, కంప్యూటర్ తదితర వాటిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రభాకర్‌రావు, పట్టణ ఎస్ఐ పైడి రాంబాబు, నకరికల్లు ఎస్ఐ ఆవుల బాలకృష్ణతో పాటు సిబ్బంది వైద్యశాల వద్దకు చేరుకున్నారు. కాగా మృతుని కుమార్తె గాయత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుని కుటుంబ సభ్యులతో వైద్యులు, పోలీసులు, రాజీ చర్చలు జరుపుతున్నారు. ఇదిలా ఉంటే మృతుని బంధువుల దాడిలో గాయపడిన అనస్తీషియన్‌కి గాయాలు కావడంతో ఆయనను చికిత్స నిమిత్తం గుంటూరులోని సురక్ష ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ క్రియాశీల కార్యకర్త బండారు ఏడుకొండలు (78) శనివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన పార్టీ నాయకులు ఏడుకొండలు మృతదేహానికి నివాళులర్పించారు. ఏడుకొండలు కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. మృతునికి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సర్పంచ్ గంగిరెడ్డి హనుమాయమ్మ ప్రతాపరెడ్డి, మాజీ ఎంపీపీ బద్ధూరి చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ బద్ధూరి శేషిరెడ్డి, పమ్మి శ్రీనివాసరెడ్డి, బత్తుల రామకృష్ణ, పెద లక్ష్మీనారాయణ ఉన్నారు.